

# పదవుల కోసం పడిగాపులు



## నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూపులు

- ఆశావహుల తీవ్ర ప్రయత్నాలు
- రోజూ ఎమ్మెల్యేల వద్దకు కాంగ్రెస్ లీడర్లు
- టికెట్లు వదులుకున్నా స్పందించడం లేదని ఆవేదన
- ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్

'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడి పనిచేసినం.. నామినేటెడ్ పోస్టులు ఇస్తామని అభ్యర్థులు చెబితే పోటీ విరమించుకున్నం.. ఎమ్మెల్యేలు ఎన్నికై రెండు నెలలు కావస్తున్నా నామినేటెడ్ పదవుల భర్తీపై ఎట్లాంటి కదలికల్లేవు.. పదేండ్లుగా పార్టీ కోసం కష్టపడ్డా పదవుల పంపకంలో అధిష్టానం నిర్లక్ష్యం చేస్తున్నది' అంటూ 'ఆశావహులు' వాపోతున్నారు. సంక్రాంతిలోపే అన్ని స్థాయిల్లో పదవులు భర్తీ చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారుతున్నాయంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల లోపైనా పదవులు ఇస్తారా? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నేతలకు పదవుల విషయంలో ఎమ్మెల్యేలు స్పందించడంలేదంటున్నారు.

– వరంగల్, జనవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ లీడర్లు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు దగ్గరపడుతున్నా, ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి ఇచ్చే పదవుల పంపకంపై స్పష్టత లేదు. పదవుల భర్తీ ప్రక్రియలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం అనుసరిస్తున్న నాన్చివేత ధోరణిపై ఆ పార్టీ నేతలు ఆవేదన చెందుతున్నారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా), మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలు, గ్రంథాలయ సంస్థలతోపాటు ఇతర రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల కోసం ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నేతలు ఎదురు చూస్తున్నారు. ఈ పదవుల కోసం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వద్దకు రోజూ వెళ్లి వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం కష్టపడి పని చేశామని గుర్తు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటున్నారు. పదవుల పంపకం విషయంలో పార్టీ అధిష్టానం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెబుతున్నారు. సంక్రాంతిలోపే నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని చెప్పి ఇప్పుడు తాత్సారం చేస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికలలోపైనా ఇస్తారా అని సందేహిస్తున్నారు.

### టికెట్లు వదులుకున్నా..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులకు టికెట్లు దక్కలేదు. పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో అప్పటికప్పుడు పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే అభ్యర్థులుగా కాంగ్రెస్ ప్రకటించింది. ఏండ్లుగా పార్టీ కోసం పనిచేసిన నేతలకు టికెట్ విషయంలో అన్యాయం జరిగింది. కొత్త వారికి టికెట్లు ఇచ్చేటప్పుడు పాత వారికి ఎమ్మెల్సీ, ఇతర రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం హామీ ఇచ్చింది. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం పంపిన పరిశీలకులు టికెట్లు దక్కని నేతల ఇంటికి వెళ్లి మరీ ఎమ్మెల్సీ, ఇతర రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులు ఇస్తామని చెప్పారు. ఎన్నికలు ముగిసి దాదాపు రెండు నెలలవుతున్నా వీరికి పదవుల విషయంలో అధిష్టానం నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఇతర పార్టీల నుంచి చేరిన వారికి టిక్కెట్లు ఇచ్చి దశాబ్దాలుగా కాంగ్రెస్ కోసం పని చేసిన తమకు అన్యాయం చేశారని, ఇప్పుడు నామినేటెడ్ పదవుల భర్తీలోనూ జాప్యం చేస్తూ అలాగే చేస్తున్నారని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తే పార్టీకి వచ్చే ఇబ్బందులు ఏమిటో అర్థం కావడంలేదంటున్నారు. ఇతర నియోజకవర్గాల్లోని సీనియర్ నేతలు పదవుల కోసం పడిగాపులు కాస్తున్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న పడమరకోట ఎస్సీ కాలనీవాసులు

## ఖాళీ బిందెలతో నిరసన

*ఖిలావరంగల్, జనవరి 27: వరంగల్ జిల్లా ఖిలావరంగల్ పడమరకోట ఎస్సీ కాలనీ వాసులు స్థానిక కమ్యూనిటీ హాల్ వద్ద శనివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తాగునీటిని మూడు రోజులకోసారి ఇస్తూ సమయపాలన పాటించడంలేదని, రాత్రి అందరూ నిద్రించాక 10 నుంచి 11 గంటల మధ్య సరఫరా చేయడం వల్ల నీరు వృథాగా పోతోందని వాపోయారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే జీడబ్ల్యూఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో స్థానికులు సుద్దాల నాగరాజు, బరిగెల రాజు, నలిగంటి కిషోర్, కేషపాక రాజు, గడిపి జగదీశ్, మేకల రాజు, గడిపి లక్ష్మమ్మ, దర్శనాల పాపమ్మ, స్వరూప, మమత, రమా రాధిక, మాధవి పాల్గొన్నారు.*



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

*కరీమాబాద్, జనవరి 27: నగరంలోని ఖిలావరంగల్ మండల పరిధి ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 140లో అక్రమ నిర్మాణాలను అధికారులు శనివారం కూల్చేశారు. గతంలో కొందరు ఫిర్యాదు చేయగా రెవెన్యూ, వరంగల్ మహానగర పాలక సంస్థ, పోలీస్ అధికారులు స్పందించారు. గతంలో ఈ సర్వేనంబర్‌లో దాదాపు ఎకరం భూమిని బీఆర్ఎస్ పార్టీకి కేటాయించారు. దీంతో మే 2023లో పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఈ స్థలానికి హద్దులను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతోపాటు ఆ స్థలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.*



హైదరాబాద్‌లోని సచివాలయంలో మేడారం మహాజాతర ఆహ్వాన పత్రికను సీఎం రేవంత్‌రెడ్డికి అందిస్తున్న పూజారులు, చిత్రంలో మంత్రి సీతక్క

## మేడారం జాతరకు సీఎంకు ఆహ్వానం

- పత్రికను అందించిన పూజారులు
- ఫిబ్రవరి 23న వస్తానని సీఎం హామీ

తాడ్వాయి, జనవరి27: వచ్చే నెల 21నుంచి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు రావాలని కోరుతూ శనివారం అమ్మవార్ల పూజారులు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. అమ్మవార్ల పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారులు సీఎంతోపాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖను కలిసి మహాజాతర పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం మేడారం జాతరలో చేపట్టాల్సిన పనులు, పూజారుల సమస్యలను జగ్గారావు ముఖ్యమంత్రికి వివరించారు. మహాజాతరకు వచ్చి తల్లుల తీర్థప్రసాదాలను అందుకోవాలని కోరగా, ఫిబ్రవరి 23వ తేదీన అమ్మవార్ల దర్శనానికి వస్తానని సీఎం తేదీని ఖరారు చేశారు.

## ప్రాక్టికల్స్‌తోనే కోర్సుకు విలువ

హనుమకొండ చౌరస్తా, జనవరి 27: ప్రాక్టికల్స్‌తోనే కోర్సుకు విలువ పెరుగుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయ కామర్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో వర్సిటీ పరిధి ఉమ్మడి మూడు జిల్లాల కామర్స్ అధ్యాపకులకు పాఠ్యప్రణాళిక అధ్యక్షుడు ప్రొఫెసర్ రాజేందర్ కట్ల అధ్యక్షతన నిర్వహించిన 'రిపోర్ట్ రైటింగ్‌పై ఓరియంటేషన్ ప్రోగ్రామ్'లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కామర్స్ కోర్సుకు మంచి భవిష్యత్ ఉందని, కొంత వృత్తిపరమైన నైపుణ్యాలు కలిగి ఉంటే మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సదస్సులో కామర్స్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహాచారి, కాలేజీ ఒప్పంద అధ్యాపకులు డాక్టర్ ప్రగతి, డాక్టర్ కటకం ఫణీంద్ర పాల్గొన్నారు.

## పేటెంట్ల వాణిజ్యకరణతో ఉపాధి

హనుమకొండ చౌరస్తా, జనవరి 27 : పేటెంట్ల వాణిజ్యకరణతో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జీబీ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ ప్రభుత్వ ఈఎఫ్ఎస్ అండ్ టీ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కేయూ సెనెట్ హాల్‌లో సదస్సు జరిగింది. 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్) కేరీర్స్ ఇన్ ఐపీఆర్ అవేర్నెస్ ప్రోగ్రాం' అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు.



వంగిన చెట్లు



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ధ్వంసమైన యోగ ముద్ర విగ్రహాలు



## పబ్లిక్ గార్డెన్ కళా విహీనం

### ధ్వంసమైన యోగ ముద్ర విగ్రహాలు

### విరిగిన ఊయల

పబ్లిక్ గార్డెన్ కళా విహీనంగా తయారైంది. యోగ ముద్ర విగ్రహాలు ధ్వంసమవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. చెట్లు కూలుతున్నా, చిన్నపిల్లలు ఆడుకునే ఊయల విరిగిపోయినా అధికారులు మరమ్మతులు చేయించడం లేదు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



విరిగిన ఊయల






## కేసీఆర్ హయాంలోనే సర్కారు స్కూళ్లకు పునరుజ్జీవం

### ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు



*జయ్యారంలో తన గురువు జగన్నాథరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు*

చిన్నగూడూరు, జనవరి 27 : కేసీఆర్ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలకు పునరుజ్జీవం కలిగిందని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావ్ అన్నారు. శనివారం ఎమ్మెల్సీ చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామంలో తన గురువు పానుగంటి జగన్నాథరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు. స్థానిక హైస్కూల్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. గ్రామంలోని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానమందిరాన్ని సందర్శించారు. గ్రామంలోని బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల కోసం టాయిలెట్స్ నిర్మాణానికి రూ.5 లక్షలు, బతుకమ్మ ఘాట్‌కు మరో రూ.5 లక్షలు ఇస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం సర్కారు స్కూళ్లలో సకల సౌకర్యాలు కల్పించి, విద్యావ్యవస్థను బలోపేతం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మంగళంపెల్లి కన్న, జెర్రిపోతుల వెంకన్న, బానోత్ రవికుమార్, ఎల్ది మల్లయ్య, మడత వెంకన్న, పుచ్చకాయల రామకృష్ణ, స్థానికులు వల్లూరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


